

శుభ కార్యాలకు సెలవు
ఈ ఏడాది వరుసగా మూడు నెలల పాటు వివాహ ముహూర్తాలు లేకపోవడంతో ఆయా రంగాలపై ఆధారపడిన వ్యాపారాలు పూర్తి స్థాయిలో డీలా పడ్డాయి. -8లో



లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా కృషి
జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడేలా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి అన్నారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.8/26.7

జిల్లాలో శుక్రవారం 26.7 - 35.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఐటీఐలలో రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం
కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2వ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ మైనార్టీల ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎం. జ్ఞానకుమార్ తెలిపారు. విద్యార్థులు 10వ తరగతి పాస్/ఫెయిల్, ఇంటర్ పాస్/ఫెయిల్ ఆపై విద్యార్హతలు కలిగిన వారు కూడా అడ్మిషన్లను పొందవచ్చని ఆయన తెలిపారు. అభ్యర్థులు తమ అప్లికేషన్‌ను ఆన్‌లైన్ ద్వారా iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. విద్యార్థులు తమ అప్లికేషన్ రిజిస్ట్రేషన్ కోసం తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫొటో, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం తీసుకుని దగ్గరలోని ఐటీఐల వద్దకు వెళ్లి తమ వివరాలను ఉచితంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అప్లికేషన్‌కు జులై 24వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలలో చేరేందుకు జులై 27, 28వ తేదీలలో ఆయా ఐటీఐల వారు కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తారని చెప్పారు. ఆదే విధంగా ప్రైవేటు ఐటీఐలలో చేరుటకు జూలై 29, 30వ తేదీలలో ఆయా ఐటీఐలలో కౌన్సిలింగ్‌ను ఉంటుందని వివరించారు. అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ ఐటీఐల జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: జూలై 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలని జిల్లాలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పంపిణీ జరగాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పెన్షన్ల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ గణేష్ కుమార్, డిఆర్‌ఓ గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీకి అన్ని విధాలా సన్నద్ధం కావాలన్నారు. జూలై 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి ఖచ్చితంగా పెన్షన్ల పంపిణీ మొదలు కావాలని ఆదేశించారు. నియోజకవర్గ అధికారులు పెన్షన్ల పంపిణీని ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు.

● సేవకు శ్రీకారం..
మా అమ్మ ఒడితో సాకారం

సమాజ సేవకు మేముసైతం అంటూ రెవెన్యూ సేవా సంస్థ అడుగు ముందుకేసింది. అనాథ పిల్లలను అక్కున చేర్చుకోవడమే లక్ష్యంగా 'మా అమ్మ ఒడి'కి శ్రీకారం చుట్టింది. ఎంతోమందిని విద్యాబుద్ధులు నేర్పిస్తూ.. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ విజయవంతంగా ముందుకు సాగుతోంది. రాష్ట్రంలోనే తొలిసారిగా రెవెన్యూ ఆధ్వర్యంలో నడుస్తున్న 'మా అమ్మ ఒడి'పై ప్రత్యేక కథనం.

- రెవెన్యూ సేవా సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల నిర్వహణ
- రెవెన్యూ ఆధ్వర్యంలో రాష్ట్రంలో తొలిసారి
- ఉన్నత స్థానాల్లో రాణిస్తున్న విద్యార్థులు



మా అమ్మ ఒడి భవనం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా రెవెన్యూ ఉద్యోగులు సమాజ సేవలో విశేషంగా రాణిస్తున్నారు. తమ సేవా సంస్థ ఆధ్వర్యంలో 'మా అమ్మ ఒడి'కి శ్రీకారం చుట్టి విజయవంతంగా నడిపిస్తున్నారు. 2005 ఆగస్టు 15న కలెక్టర్ గోపాలకృష్ణపిళ్లై అశోక్‌కుమార్ కడప రాధాకృష్ణ నగర్‌లోని ఓ అద్దె భవనంలో ఈ సంస్థను ప్రారంభించారు. కలెక్టర్ ఎక్స్ అఫీషియో అధ్యక్షునిగా వ్యవహరించే ఈ సంస్థ దాతల సహకారంతో నడుస్తోంది. మా అమ్మ ఒడిలో ఆశ్రయం పొందిన పలువురు పిల్లలు ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి ఉన్నత విద్యలు పూర్తి చేసి మంచి ఉద్యోగాల్లో రాణిస్తున్నారు.

'బాధ్యత' గుర్తెరిగి..

వీధి పిల్లలు, ముఖ్యంగా అనాథ పిల్లలను ఎవరూ పట్టించుకోకపోతే అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం లేకపోలేదు. వీరిని మెయిన్ స్ట్రీమ్‌లోకి తీసుకొచ్చి బాధ్యతగల పౌరులుగా, గౌరవ ప్రదంగా జీవించేందుకు దోహదపడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా రెవెన్యూ ఉద్యోగులు గుర్తించారు. అందుకే తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు తొలి ప్రాధాన్యతగా, ఎవరో ఒకరిని కోల్పోయిన సెమీ ఆర్ఫన్స్‌కు ద్వితీయ ప్రాధాన్యత ప్రాతిపదికన 'మా అమ్మ ఒడి'లో ప్రవేశం కల్పిస్తున్నారు. వీరికి భోజనం, వసతి, నాణ్యమైన విద్య అందిస్తున్నారు. మొత్తం 80 మందికి ప్రవేశం కల్పించాలన్నది లక్ష్యం కాగా, ప్రస్తుతం 70 మంది ఉన్నారు. రెవెన్యూ ఉద్యోగుల విరాళాలు, ఇతర దాతల సహకారంతో మా అమ్మ ఒడి విజయవంతంగా నడుస్తోంది. అద్దె భవనంలో ఉన్నప్పుడు 24 మంది పిల్లలకే అవకాశం ఉండేది. దీంతో సొంత భవనాన్ని నిర్మించుకోవాలని భావించారు. అందుకోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని నాటి కలెక్టర్ శశిభూషణ్‌కుమార్‌కు విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి కడప మండలం చిన్నచౌకు గ్రామ పొలం సర్వే నెంబర్లు 1032/15, 1032/16లో 0.95 సెంట్ల స్థలం మంజూరు చేశారు. ఆ స్థలంలో మా అమ్మ ఒడి, వృద్ధాశ్రమం, పాఠశాల వరుస క్రమంలో ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించారు. రూ. 85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన మా అమ్మ ఒడి నిర్మాణానికి 2010 మార్చి 28న కలెక్టర్ శశిభూషణ్‌కుమార్ భూమి పూజ నిర్వహించారు. ఆపై కలెక్టర్, జేసీ చొరవతో రూ. 50 లక్షల నగదు, రూ. 17 లక్షలు విలువజేసే భవన నిర్మాణానికి అవసరమయ్యే మెటీరియల్ విరాళాల రూపంలో సమకూరాయి. ముంబైకి చెందిన హెచ్‌పీసీఎల్ సంస్థ రూ. 55 లక్షల వ్యయంతో ఉచితంగా మొదటి అంతస్తు నిర్మాణం పూర్తి చేసి అప్పగించింది. దీంతో 2011 జూన్‌లో పిల్లలను అద్దె భవనం నుంచి కొత్తగా నిర్మించిన సొంత భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లోకి తరలించారు. ఆ తర్వాత కలెక్టర్ కేవీ రమణ సలహా మేరకు 2017-18 విద్యా సంవత్సరం నుంచి ప్రాథమికోన్నత ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రారంభించారు. ఇందులో మా అమ్మ ఒడికి చెందిన 40 మంది పిల్లలతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన 140 మంది పేద పిల్లలకు ప్రవేశం కల్పించారు. బయటి పిల్లలు నామమాత్రపు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. పిల్లలను చదువులోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా చూస్తున్నారు. కలెక్టర్ కేవీ సత్యనారాయణ ఉన్న సమయంలో పిల్లలకు కరాటే శిబిరాన్ని నిర్వహించారు. మా అమ్మ ఒడి ఆవరణలో రెవెన్యూ సేవా సంస్థ ఆధ్వర్యంలో 2005 నుంచి నేటి దాకా యేటా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు.

▶▶ రాణించిన పలువురు విద్యార్థులు

మా అమ్మ ఒడిలో చదివిన పలువురు విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. కడప నగరానికి చెందిన తేజ 2016లో స్విస్ట్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ప్రస్తుతం బెంగుళూరులో ఉంటూ ఢిల్లీకి చెందిన వాజీరాం రవి ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నుంచి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ తీసుకుంటున్నారు. మరి కొందరు విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గి సచివాలయాలు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.



మా అమ్మ ఒడి ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాల

"

సమష్టి కృషి ఫలితమే



జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సమిష్టి కృషి ఫలితంగానే నేడు 'మా అమ్మ ఒడి' విజయవంతంగా నడుస్తోంది. సమాజ సేవలో రెవెన్యూ ఉద్యోగులు భాగస్వాములు కావడం రాష్ట్ర చరిత్రలో ప్రథమం. ఎక్స్ అఫీషియో అధ్యక్షులుగా వ్యవహరించే కలెక్టర్ల సహకారం మరువలేనిది. ఉమ్మడి జిల్లాలోని అనాథ పిల్లలకు మాత్రమే ఇక్కడ ప్రవేశం ఉంటుంది. ఇక్కడ చదివిన పలువురు పిల్లలు నేడు ఉన్నత రంగాల్లో రాణించడం మాకు గర్వకారణం. - ప్రభాకర్‌రెడ్డి, గౌరవ ఉపాధ్యక్షుడు, రెవెన్యూ సేవా సంస్థ, కడప

మా అమ్మ ఒడి తోడ్పాటుతోనే..



మాది చాపాడు మండలం పెద్దచియ్యపాడు గ్రామం. తల్లిదండ్రులిద్దరూ నా చిన్నతనంలోనే చనిపోవడంతో తొండూరు మండలం భద్రంపల్లెలోని మా అవ్వాతాత ఇంటిలో పెరిగాను. నాల్గవ తరగతిలో మా అమ్మ ఒడిలో చేరి పదవ తరగతి వరకు ఇక్కడే చదివాను. కుసుమ మేడమ్, శివాజీ సార్ స్పాన్సర్ చేశారు. ఆర్టీసీ అధికారి శ్రీలక్ష్మి మేడమ్ సహకారంతో విజయవాడ శ్రీభాష్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ 2021లో పూర్తయింది. ఇప్పుడు తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లి ఎస్‌ఐటీలో ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్నాను. ప్రస్తుతం బెంగుళూరు మైక్రోసాఫ్ట్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాను. ఇంజనీరింగ్ పూర్తి కాగానే ఎంఎస్ లేదా ఎంబీఏ చేయాలని భావిస్తున్నాను. మా అమ్మ ఒడి తోడ్పాటుతోనే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. -ప్రవీణ్‌కుమార్

మోసపు హామీలతో అధికారంలోకి కూటమి

- అధైర్యపడవద్దు ..అండగా ఉంటాం
- ప్రతి కార్యకర్తకు తోడుగా ఉంటా..
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

పులివెందుల రూరల్: అబద్ధపు హామీలతో కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి నివాసంలో వైఎస్ మనోహర్ రెడ్డి, తొండూరు మండల ఇన్చార్జ్ వైఎస్ మధురెడ్డిలతో కలిసి కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీలు అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చాయని విమర్శించారు. చంద్రబాబునాయుడు చెప్పిన హామీలు నెరవేర్చే విధంగా లేవన్నారు. కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు ఎవరూ అధైర్యపడవద్దని, ఏ చిన్న సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే విధంగా చూస్తామని భరోసా ఇచ్చారు. నాలుగు వారాలకే ఈ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలందరు విసుగెత్తిపోతున్నారని.. టీడీపీ నాయకులు చేసే కక్ష సాధింపులు భరించలేక తిరగబడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లాలో మిగతా నియోజకవర్గాల కంటే పులివెందులలోనే ఎక్కువ సమయాన్ని గడుపుతామని హామీ ఇచ్చారు. కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే ఏడాదికి రూ.2లక్షల కోట్లు డబ్బులు అవసరమన్నారు. నెలకు వేతనాలే రూ.50కోట్లు డబ్బులు ఇవ్వాల్సి ఉంది. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు ఇస్తామని బాబు చెప్పడం అన్ని అబద్ధాలేనని దుయ్యబట్టారు. చంద్రబాబు మాదిరి జగనన్న అపద్దాలు చెప్పలేదన్నారు. ఆరునెలల పాటు ప్రభుత్వానికి సమయం ఇచ్చి ఏడవ నెల నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వంపై నిలదీసే విధంగా పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరు బాగుండాలని, కులమతాలకు, పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరిగిందన్నారు. కేవలం 24 రోజుల్లోనే ప్రజలు, అధికారులు ఎందుకురా ఈ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నామని ఆలోచనలో పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. పులివెందుల మున్సిపాలిటీ ప్రజలకు ఇంటింటికి తాగునీరు అందించే విధంగా పది ఆటోలను ఏర్పాటు చేసి నీరు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. అదే విధంగా రేషన్ షాపు నిర్వహించేవారు ఎవరూ కూడా రాజీనామాలు చేయొద్దన్నారు. కక్ష సాధింపు చర్యలు చేపడితే న్యాయస్థానాలను ఆశ్రయిద్దామని వివరించారు. అలాగే పులివెందుల ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటిని పూర్తి చేసే విధంగా చూస్తామన్నారు. మున్సిపల్ చైర్మెన్ వరప్రసాద్, వైస్ చైర్మెన్ హాఫీజ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మెన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు హాల్ గంగాధరరెడ్డి,ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి, దశరథరామిరెడ్డి, రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



చౌక.. బారు రాజకీయం

- వ్యక్తిగత వ్యాపారాలు వదిలేసి వెళ్లాల్సిందిగా టీడీపీ నేతల హుకుం
- బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు, రేషన్ డీలర్లను బెదిరిస్తున్న వైనం
- వెలుగు చూస్తున్న విష సంస్కృతి





సాక్షి ప్రతినిధి, కడప: అధికారమే పెట్టుబడిగా తెలుగు తమ్ముళ్లు దాదాగిరీ చేస్తున్నారు. ఇప్పటికే ఓ వైపు ప్రకృతి సంపదను కొల్లగొట్టి సొమ్ము చేసుకోవడంలో కొందరు మునిగిపోగా.. మరికొందరు చౌక దుకాణాలపై.. బార్లపై పడ్డారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వ్యక్తిగత వ్యాపారాలను స్వాహా చేసుకునే దిశగా బెదిరింపులకు దిగుతున్నారు. కాదు, కూడదన్నారో...అంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. వైఎస్సార్ జిల్లాలో ఎన్నడూ లేని విష సంస్కృతి తెరపైకి తీసుకొస్తున్నారు. క్రమం తప్పకుండా ఒకరి తర్వాత మరొకరిని టార్గెట్ చేస్తూ బార్ అండ్ రెస్టారెంట్లను.. చౌక దుకాణాలను స్వాహా చేసుకునే ప్రక్రియకు తెరలేపారు.

అధికారాన్ని అడ్డుపెట్టుకుని..

అధికారాన్ని అడ్డుపెట్టుకొని విపక్ష పార్టీపై దాడులు చేస్తూ పైశాచికంగా కొందరు టీడీపీ నేతలు ఆనంద పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పోకడలు తెరపైకి వస్తున్నాయి. ప్రధానంగా బార్ అండ్ రెస్టారెంట్లు .. చౌక దుకాణ డీలర్‌షిప్‌లను సొంతం చేసుకోవాలనే దిశగా చురుగ్గా పావులు కదుపుతున్నారు. తొలుత కడపలో బీజం పడగా తాజాగా జిల్లా వ్యాప్తంగా పాకిందని పలువురు వాపోతున్నారు. జమ్మలమడుగు, కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, వేంపల్లె తదితర ప్రాంతాల్లో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్లు సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

కడపలో విష సంస్కృతి...

కడప ప్రశాంతతకు నిలయంగా ఉండేది. ఎప్పుడు ఎలాంటి అలజడులు లేకుండా జిల్లా కేంద్రంలో జీవనం కొనసాగేది. టీడీపీ ప్రభుత్వం కొలువు తీరగానే, ప్రతీకార చర్యలు అటుంచితే, వ్యక్తిగత వ్యాపారాలను స్వాహా చేసుకునే చర్యలకు పాల్పడుతోన్నారు. ఓ బార్ యజమాని దగ్గరికి టీడీపీ వర్గీయులు వెళ్లి 'మీ అంతకు మీరు తాళాలు అప్పగిస్తారా... మేమే తాళం వేసుకొని వెళ్లాలా?' అంటూ తిష్టవేసి నట్లు సమాచారం. రింగ్‌రోడ్డులో ఉన్న మరో బార్ యజమానికి ఇలాంటి బెదిరింపులే వ్యక్తమైనట్లు తెలుస్తోంది. మా బార్‌లో ఫలానా టీడీపీ నేత కూడా భాగస్వామిగా ఉన్నారంటే, మీ భాగం అప్పగించి వెళ్లాలంటూ హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఈమొత్తం వ్యవహారం పులివెందుల నియోజకవర్గానికి చెందిన తెలుగుతమ్ముళ్లు కడపలో చక్రం తిప్పుతోన్నట్లు పలువురు చెప్పుకొస్తున్నారు. ఇలాంటి ఉదంతాలు క్రమంగా తెరపైకి వస్తుంటే కొందరు బహిరంగంగా చెప్పుకోలేక, ఆ వ్యాపారమే మానుకోవాలనే దిశగా ఆలోచనలో పడ్డట్లు తెలుస్తోంది. పోలీసు యంత్రాంగం దౌర్జన్యకర, దాదాగిరి ఘటనలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థ సజీవంగా కొనసాగేందుకు తోడ్పాటు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



▶▶ చౌక దుకాణాలపై..

ఇక టీడీపీ అధికారంలోకి రావడమే ఆలస్యం పలువురు టీడీపీ నేతల కన్ను చౌక దుకాణాలపై కూడా పడింది. అధికారంలోకి వచ్చి పట్టుమని ఇరవై రోజులైనా కాకముందే డీలర్‌షిప్‌లను తమ చేతుల్లోకి తీసుకోవాలని ముమ్మరంగా ఆరాటపడుతున్నారు. ఎమ్మెల్యేల నుంచి ఫోన్లు చేసి.. ఆయా ఆఫీసుల్లో తిష్టవేసి మరీ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. కాదు కూడదంటే బలవంతంగా రాజీనామాలు చేయించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, .. ఒక్కచోటేంటి జిల్లా వ్యాప్తంగా టీడీపీ నేతల దౌర్జన్యాలు మితిమీరాయి. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలే దగ్గరుండి మరీ రాజీనామాలు చేయించాల్సిన చౌక దుకాణ డీలర్ల జాబితాను అధికారులకు అందజేస్తుండడం గమనార్హం.

వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా రఘునాథరెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వీసీ ఆచార్య చింతా సుధాకర్ ఉత్తర్వులు జారీచేసి నియామక పత్రాన్ని అందజేశారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 30వ తేది ఆదివారం సెలవురోజయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్ రమణ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





శుభ కార్యాలకు సెలవు

ఉరుము ఉరిమి మంగళంపై పడిందన్న చందంగా వివాహాలకు తగిన ముహూర్తాలు లేకపోవడం వాటి ఆధారిత రంగాలపై ప్రభావం చూపుతోంది. ఈ రంగంపై ఆధారపడిన పలు వ్యాపారాలు మూడు నెలలపాటు మూతపడదంతో అందులో జీవిస్తున్న చిరుద్యోగుల ఊపిరి ఊద్చేసినట్లయింది. ఎక్కడా మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చాటనలు వినిపించకపోవడంతో ఆ రంగంపై ఆధారపడ్డ చిరుద్యోగుల ముఖాల్లో కళ తప్పింది.

- ఉపాధిని ఊడ్చేసిన శూన్యమాసం
- వివాహ ఆధారిత వ్యాపారాలు నిల్
- కుదేలవుతున్న వ్యాపార రంగాలు



కడప కల్చరల్ : ఉమ్మడి జిల్లాలో వస్త్ర, నగలు, ఇతర వ్యాపార రంగాలు కుదేలవుతున్నాయి. ఈ ఏడాది వరుసగా మూడు నెలల పాటు వివాహ ముహూర్తాలు లేకపోవడంతో ఆయా రంగాలపై ఆధారపడిన వ్యాపారాలు పూర్తి స్థాయిలో డీలా పడ్డాయి. సాధారణంగా వివాహ ముహూర్తాలు ఉన్న సమయంలో వధూ వరులు, వారి బంధు మిత్రుల కుటుంబాల్లోనేగాక వివాహ నిర్వహణకు అవసరమయ్యే వ్యాపార వర్గాల్లోనూ ఆనందోత్సాహాలుంటాయి. ప్రస్తుతం మూఢంతోపాటు సరైన ముహూర్తాలు లేక పెళ్లి బాజాలు ఎక్కడా వినిపించడం లేదు. ఈ పరిస్థితి దాదాపు మూడు నెలలపాటు ఉంటుంది. జులై 5వ తేదీ నుంచి ఆషాడ మాసం ప్రారంభమవుతున్నందున ఈ మాసంలో కూడా పూర్తి స్థాయిలో వివాహాలుండవు. ఆషాడంను శూన్య మాసంగా భావిస్తారు. ఈ మాసంలో వివాహాలు, ప్రారంభోత్సవాలు, గృహ ప్రవేశాలు ఇతర శుభ కార్యాలను తలపెట్టరు. నూతన వ్యాపారాల ప్రారంభం, రిజిస్ట్రేషన్లు, ప్రారంభోత్సవాలు, నామకరణాలు వంటి కార్యక్రమాలు తలపెట్టరు. శ్రావణం తర్వాత సెప్టెంబరు 4వ తేదీ నుంచి మరోసారి శూన్య మాసం రానుంది. వినాయక చవితి పండగ తెచ్చే భాద్రపద మాసం శూన్య మాసం కావడంతో అక్టోబరు 3వ తేదీ వరకు శుభకార్యాలు తలపెట్టే అవకాశం లేదు. ఇప్పటికే ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు మూఢం కారణంగా వివాహాలు లేకపోవడంతో శుభకార్యాల కళ తప్పింది.

ఎదురుచూడక తప్పదు

వివాహ ముహూర్తాల కోసం మరిన్ని నెలల పాటు ఎదురు చూడక తప్పదు. వచ్చే ఏడాది వరకు శుభకార్యాలకు అనువైన ముహూర్తాలు లేవని పండితులు పేర్కొంటున్నారు. సంవత్సరం చివర డిసెంబరు మార్గశిర మాసంలో పెళ్లిళ్లకు అనుకూలంగా ఉన్నా బలమైన ముహూర్తాలు కావని వేద పండితులు ఆసక్తి చూపడం లేదు. జనవరి 30వ తేదీన మాఘ మాసం ప్రవేశిస్తున్న కారణంగా ఆ ముహూర్తాల్లో శుభ కార్యాలు తలపెట్టడం మంచిదని సూచిస్తున్నారు. అప్పటివరకూ ఎదురుచూడక తప్పదని స్పష్టం చేస్తున్నారు. ఆ తర్వాత ఫాల్గుణ మాసంలో వివాహాలకు మంచి ముహూర్తాలు ఉండడంతో ఫిబ్రవరి చివరి నుంచి మార్చి చివరి వరకు వరుస ముహూర్తాలతో శుభకార్యాలు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. అనుకోని అవాంతరాల కారణంగా ఇప్పటికే వివాహాలు ఆలస్యమవుతున్నాయనే భావన కలిగితే తప్పనిసరిగా భావించి వివాహాలకు సిద్ధమయ్యే అవకాశాలు లేకపోలేదు. ఆగస్టు 5వ తేదీ నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుండడంతో మరో అరడజను ముహూర్తాలు ఉన్నాయని తెలుపుతున్నారు.

ఊడ్చుకుపోయిన ఉపాధి

వివాహాలు లేకపోవడంతో ఆ రంగంపై ఆధారపడి జీవిస్తున్న చిరుద్యోగులు, వ్యాపారులు ఉపాధిలేక ఉసూరుమంటున్నారు. కార్పొరేట్ స్థాయి వివాహ నిర్వహణ సంస్థలు, కల్యాణ మండపాల వ్యాపారులు, బంగారం, కేటరింగ్, భోజనాల తయారీ రంగం, డెకరేషన్, వీడియో, ఫోటోగ్రాఫర్లు, పురోహితులు, ట్రావెలింగ్ రంగాలు పనిలేక స్తబ్దంగా ఉన్నాయి. ఈ పరమైన వ్యాపారం ఇన్ని నెలలపాటు లేకపోవడంతో దీనికి సంబంధించి దాదాపు రూ.1000 కోట్లకు పైగా వ్యాపారాలకు బ్రేక్ పడింది. ఈ ప్రభావం చిరు వ్యాపారులు, వివాహ రంగంపై ఆధారపడిన దినసరి కూలీలపై ఎక్కువగా ఉంది.

క్లుప్తంగా

పేకాట జోరు... జనం బేజారు

కొండాపురం, కడప : జిల్లాలోని మారుమూల కొండాపురం మండలంలో పేకాట జోరుగా సాగుతోంది. కూర్చున్న చోటనే సులభంగా సంపాదించాలనే అత్యాశతో కొంతమంది జేబులు గుల్ల చేసుకుంటున్నారు. పచ్చని కాపురాల్లో పేకాట చిచ్చు పెడుతోంది. వ్యసనానికి బానిసలైన ఎందరో నిలువ నీడను కోల్పోయి రోడ్డున పడుతున్నారు. కొండాపురం మండలం గండికోట జలాశయంలో నీటి మట్టం తగ్గింది. ముంపునకు గురైన కె.సుగుమంచిపల్లె, తాళ్ల ప్రొద్దుటూరు గ్రామాలను పేకాట ఆడేందుకు ఎంచుకుంటున్నారు. వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పేకాట రాయుళ్లు రావడంతో శిబిరాలు సందడిగా సాగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వం కొలువు దీరడంతో కొందరు గ్రామస్థాయి నాయకులు వేరే ఆదాయ వనరులు లేక ఈ శిబిరాల నిర్వహణపై దృష్టిపెట్టారు. 15 రోజులుగా పేకాట జోరు కొనసాగుతున్నా.. కొందరు పోలీస్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. గాడిలో పెట్టాల్సిన వారే ప్రత్యక్ష పాత్ర పోషిస్తూ మమ అనిపిస్తున్నారు. సీఐ స్థాయి అధికారులు తాము రెండు, మూడు రోజుల్లో బదిలీ అవుతున్నందున ఏమి చేయడంలేదని చెప్పడం గమనార్హం. ఎస్పీ స్పందించి పేకాట స్థావరాలపై దాడులు నిర్వహిస్తే నిజాలు బయటపడతాయని ప్రజ లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సీఐ వేణుగోపాల్ ను వివరణ కోరగా పేకాడుతున్నట్లు తమ దృష్టికి రాలేదని, విచారించి పేకాట రాయుళ్లను పట్టుకుంటామని తెలిపారు.

తండ్రీ కొడుకులపై అల్లుడి దాడి

కడప అర్బన్ : తండ్రీ, కొడుకులపై అల్లుడే కత్తితో దాడి చేసిన సంఘటన కడప నగరంలోని శారదా నిలయం సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి నబీరసూల్, తన స్నేహితులతో కలిసి మద్యం తాగుతున్నాడు. అదే సమయంలో అక్కడ ఉన్న చాన్(43) అతని కుమారుడు జంక్షాన్ వలి(17) ఎందుకు మద్యం తాగుతూ అల్లరి చేస్తున్నారని ప్రశ్నించారు. ఆగ్రహంతో ఊగిపోయిన నబీరసూల్ కత్తితో వారి దాడి చేశాడు. నబీరసూల్ మూడేళ్ల కిందట చాన్ కుమార్తెను వివాహం చేసుకున్నా.. వీరి మధ్య మనస్పర్థలున్నట్లు తెలిసింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నబీరసూల్‌తోపాటు మరికొందరి పాత్రపై విచారిస్తున్నారు. కమ్యూనిష్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భర్తగా తోడు ఉంటానని మోసం చేశాడు

న్యాయం కోసం స్టాఫ్ నర్సు వేడుకోలు



వివాహం చేసుకున్నట్లు ఫొటో చూపుతున్న భానోత్ చిన్నమ్మ

కడప రూరల్ : జీవితాంతం భర్తగా తోడుగా ఉంటానని ఓ వైద్యాధికారి తనను మోసగించాడని కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి స్టాఫ్ నర్సు భానోత్ చిన్నమ్మ ఆరోపించారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆమె మాట్లాడుతూ తనకు 1986లో ఒక వ్యక్తితో వివాహం జరిగిందని, నలుగురు పిల్లలున్నారని తెలిపారు. అనంతరం భర్తతో విడాకులు తీసుకున్నానన్నారు. తాను వైద్య ఆరోగ్యశాఖలో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం వచ్చినపుడు కమలాపురం పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించానని తెలిపారు. అక్కడ మెడికల్ ఆఫీసర్‌గా ఉన్న చెన్నకృష్ణ తనను బెదిరించి మాయ మాటలతో లొంగదీసుకున్నాడన్నారు. భర్తగా తోడుగా ఉంటానని నమ్మించి 2013లో తిరుపతిలో వివాహం చేసుకున్నారని పేర్కొన్నారు. కడపలో ఇంటిని అద్దెకు తీసుకుని ఉన్నామన్నారు. ప్రస్తుతం రాజంపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న చెన్నకృష్ణ, అతడి మొదటి భార్య, పిల్లలు తనపై ఇటీవల దాడి చేశారన్నారు. తోడుటానన్న వ్యక్తి తనను మోసం చేయడం బాధిస్తోందని, చెన్నకృష్ణను నిలదీస్తే తనను కులం పేరుతో దూషిస్తూ ఎవరికీ చెప్పుకుంటావో చెప్పుకో అని బెదిరిస్తున్నారన్నారు. తనకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.

రైతులకు వెండి బహుమతుల ప్రదానం



రైతులకు వెండి బహుమతులను అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్ : కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెట్ నిర్వహించిన గ్రోమోర్ రైతు సంబరాల్లో భాగంగా ముగ్గురు రైతులకు వెండి బహుమతులు అందజేశారు. జిల్లాలో 2023-24 సంవత్సరంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు కొనుగోలు చేసిన వారిలో లాటరీ ద్వారా ఎంపిక చేయగా వైఎస్సార్ జిల్లా వాసులు సుమలత, సంగమ్మ, సదాశివారెడ్డిలు విజేతలుగా నిలిచారు. కడప జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో అయితా నాగేశ్వరరావు చేతుల మీదుగా ఒక్కొక్కరికి 50 గ్రాముల వెండి బహుమతి అంద జేశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి పరిమళ జ్యోతి, కోరమాండల్ సంస్థ సీనియర్ మేనేజర్ విజయ్‌కుమార్, జేడీఏ కార్యాలయ ఏఓ సుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా కృషి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి



ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి

కడప అర్బన్ : జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడేలా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి అన్నారు. ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు.

కడప జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయ సదన్‌లో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. జి.శ్రీదేవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 22 బెంచీలలో కేసుల పరిష్కారానికి కృషి జరిగిందన్నారు.

2190 కేసుల పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్‌లో 2190 కేసులను శనివారం పరిష్కరించారు. కక్షిదారులకు రూ. 7,51,35,591 నష్ట పరిహారం అందింది. ఎంవీఓపీ నెం.415/2019 కేసులో రూ.49 లక్షల మొత్తం కేసులో వాది జె.అమ్మనితో బజాజ్ అలయన్స్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు రాజీ అయ్యారు. చెక్కును కక్షిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు ఎల్.వెంకటేశ్వరరావు, జి.దీనబాబు, షేక్ ఇంతియాజ్ అహ్మద్, జె.నందిని, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్ కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి, జె.హేమస్రవంతి, జి.గురప్ప, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

పందుల పెంపకందారులపై కేసులు



అటవీశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పందుల యజమానులు, కూలీలు



స్వాధీనం చేసుకున్న ఆటో, బైక్‌లు

- అడవి పందుల కోసం వచ్చారని ఆరోపణ
- అటవీ కార్యాలయానికి పది మంది తరలింపు

ప్రొద్దుటూరు క్రైం : బంధువులకు విక్రయించిన పందులను పట్టి తీసుకెళ్లేందుకు వచ్చిన పందుల పెంపకందారులపై ప్రొద్దుటూరు అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు.. అడవి పందుల కోసం వచ్చారనే కారణం చూపి పదిమంది కూలీలు, యజమానులను అర్ధరాత్రి అరెస్టు చేసి అటవీ కార్యాలయానికి తరలించారు. వీరిలో మహిళలు కూడా ఉన్నారు. స్థానికుల వివరాల మేరకు.. మైదుకూరు వాసులు సుంకన్న, రమణయ్య పెంచుకుంటున్న సుమారు 150 పందులు కల్లూరులో ఉన్నాయి. 30 ఏళ్లగా వీరు పందులను పెంచుకుంటూ వాటి పిల్లలను విక్రయిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో రమణయ్యకు చెందిన 50 పందులను తమ సమీప బంధువు కర్నూలుకు చెందిన పోలా నాగన్నకు కిలో రూ.200కు విక్రయించేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. శుక్రవారం ఆ పందులను పట్టుకునేందుకు కర్నూలు నుంచి ఎనిమిది మంది కూలీలతో కలిసి మైదుకూరు సమీపంలోని కల్లూరుకు వచ్చారు. ఆటోతోపాటు 12 వలలు తెచ్చుకున్నారు. శనివారం ఉదయం పందులు పట్టుకోవాలని భావించి రాత్రి స్థానిక గంగమ్మ ఆలయం వద్ద పడుకున్నారు.

అడవి పందుల కోసం వచ్చారనే సమాచారంతో..

కల్లూరు పరిసర ప్రాంతంలో రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. ఇక్కడ నిత్యం అటవీ శాఖ అధికారుల నిఘా ఉంటుంది. అడవి పందులు పట్టుకోవడానికి కొత్త వ్యక్తులు వచ్చారని కొందరు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం రాత్రి 11.30 సమయంలో ఎఫ్ఆర్ఓ హేమాంజలి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవిచంద్ర, తమ సిబ్బందితో కలిసి కల్లూరు గ్రామానికి వెళ్లారు. అక్కడ కర్నూలు నుంచి వచ్చిన వ్యక్తులు ఉండడతో అరెస్టు చేశారు. ఓ ఆటో, రెండు బైక్‌లు, 12 వలలు వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఏపీ ఫారెస్ట్ యాక్ట్ 1967, వైల్డ్ లైఫ్ యాక్ట్ 1972 కింద పది మందిపై కేసు నమోదు చేసినట్లు సెక్షన్ ఆఫీసర్ రవిచంద్ర తెలిపారు.

అన్యాయంగా మమ్మల్ని అరెస్టు చేశారు

పెంచుకున్న పందుల కోసం వస్తే అన్యాయంగా అరెస్టు చేశారని పందుల పెంపకం దారులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యాలయానికి వస్తే మాట్లాడి పంపిస్తామని చెబితే తామంతా వచ్చినట్లు తెలిపారు. ఇక్కడికి వచ్చిన తర్వాత కేసు నమోదు చేశారని, తాము పెంచుకుంటున్న పందులు అక్కడ ఉన్నట్లు గ్రామంలో ఎవరిని అడిగినా చెబుతారని ఆరోపించారు. శుక్రవారం అర్ధరాత్రి తమను ప్రొద్దుటూరు కార్యాలయానికి తీసుకువచ్చి, మహిళలనే కనికరం లేకుండా ఇబ్బంది పెట్టారన్నారు.

పురపాలక స్థలం ఆక్రమణ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల పట్టణంలోని భాకరాపురం జయమ్మ కాలనీలోని వాటర్‌ప్లాంట్ వద్ద ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుని దస్తగిరి అనే వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించి డోజర్‌తో చదును చేశాడు. మున్సిపల్ అధికారులకు విషయం తెలియడంతో ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయమై చైర్మెన్ వర ప్రసాద్, కమిషనర్ రమణా రెడ్డిల వివరణ కోరగా మున్సిపాలిటీలోని ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

1 నుంచి సీపీఎం జిల్లా శిక్షణ తరగతులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని ఎస్‌టీయూ భవన్‌లో జూలై 1, 2 తేదీల్లో సీపీఎం జిల్లా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ రెడ్డి , సీపీఎం రాష్ట్ర నాయకులు కందారం మురళి హాజరవుతున్నట్లు తెలిపారు.

గండి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటసుబ్బయ్య

చక్రాయపేట : ప్రసిద్ధి గాంచిన గండి వీరాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఆలయ సహాయ కమిషనర్‌గా మాజీ అధికారి అలవలపాటి ముకుందరెడ్డి నుంచి శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిలో అసంపూర్తి పనులు పూర్తిచేయించడమే కాకుండా భక్తులకు ఇబ్బంది కలగకుండా చూస్తానని చెప్పారు. ఆలయ నిర్వాహకులు ఆయనచే ప్రత్యేక పూజలు చేయించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి, ఆలయ మాజీ చైర్మెన్లు వీరభాస్కరుడు, వెంకట స్వామి పాల్గొన్నారు.

ముకుందరెడ్డికి సన్మానం

గత మూడేండ్లుగా ఆలయ సహాయ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన అలవలపాటి ముకుందరెడ్డిని ఆలయ నూతన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, అర్చకులు కేసరి, రాజ గోపాలాచార్యులు, రామ్మోహనశర్మ, సూపరింటెండెంట్ షరీఫ్, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతి



వెంకటరమణ మృతదేహం

చెన్నూరు : చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కడప-కర్నూలు జాతీయ రహదారిపై పాత టోల్ గేట్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్ ఎర్రగుంట్లకు చెందిన కంచం వెంకటరమణ(55) మృతి చెందారు. లారీ డ్రైవర్ తన సిమెంట్ లోడ్ లారీని ఆపి టీ తాగడానికి రోడ్డు దాటుతుండగా మైదుకూరు వైపు నుండి వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో కంచం వెంకటరమణ తీవ్రంగా గాయపడడంతో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భూసార పరీక్షా కేంద్రం తనిఖీ

కడప అగ్రికల్చర్ : భూసార పరీక్షా కేంద్రానికి వచ్చిన మట్టి నమూనాలను త్వరితగతిన విశ్లేషించి ఫలితాలను రైతులకు తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఊటకూరు భూసార పరీక్షా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో జరిగే మట్టి నమూనా పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాకు సంబంధించి మట్టి నమూనాల పరీక్షలు జరుగుతున్నాయని, ఆరుగురు ఏఈఓలు, ఆర్‌బీకే అసిస్టెంట్లను డిప్యూటేషన్‌పై నియమించామన్నారు. ఉదజని సూచన, లవణసాంద్రత, లభ్య నత్రజని, భాస్వరం, పోటాష్, కాపర్, జింగ్, పీ మాంజనీర్, బోరాన్, సల్ఫర్ పరీక్షలు నిర్వహించి ఏ భూమిలో ఎంత మోతాదులో పోషకాలున్నాయో వారు నిర్ధారిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రాధాదేవి, ఏఓలు ఈశ్వరకవిత, మంజుల, సుదేష్ణ, సత్యదేవి, ప్రసాద్‌రెడ్డిపాల్గొన్నారు.